క్లుప్తంగా

మాజీ లోక్‌సభ స్పీకర్ బాలయోగికి ఘన నివాళి



నెహ్రూనగర్: తొలి దళిత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి సేవలు ప్రశంసనీయమని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్(మెడికల్) జిల్లా అధ్యక్షుడు మద్దు ప్రేమజ్యోతిబాబు తెలిపారు. బాలయోగి 22వ వర్ధంతిని పురస్కరించుకుని చార్వాక యువజన సంఘం అధ్యక్షుడు చిన్నం డేవిడ్ విలియమ్స్ ఆధ్వర్యంలో లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డేవిడ్ విలియమ్స్ మాట్లాడుతూ అంబేడ్కర్ భావజాలంతో నిరంతరం దళితుల పక్షాన పోరాటం చేసిన యోధుడు బాలయోగి అని కొనియాడారు. ఆయన ఆశయాలను నేటి యువత కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు బత్తుల అనిల్‌కుమార్, ఓర్సు ప్రేమరాజు, తెనాలి మనోహర్, వేముల ప్రసాద్, సముద్రాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మాదిగ అమరవీరులకు నివాళి

నెహ్రూనగర్: మాదిగ రిజర్వేషన్ కోసం ప్రాణాల్ని అర్పించిన అమరవీరుల త్యాగం మరువలేనిదని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ తెలిపారు. మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కాకాని రోడ్డులోని సంఘ కార్యాలయంలో అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏసుబాబు మాదిగ మాట్లాడుతూ రిజర్వేషన్ కోసం ప్రాణాలర్పించిన వారి త్యాగాలు, ఆశయాలను వృథా చేయకుండా వర్గీకరణ పోరును కొనసాగించాలని తెలిపారు. వర్గీకరణకు సహకరించే రాజకీయ పార్టీలకే తమ మద్దతు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సుబ్బయ్య, కిశోర్, ప్రసాద్, రమణ పాల్గొన్నారు.

నేడు నగరపాలక సంస్థలో 'స్పందన'

నెహ్రూనగర్: ప్రజల నుంచి స్థానిక సమస్యలపై అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో నిర్వహించనున్నట్లు కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సచివాలయాల్లోనూ ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన జరుగుతుందన్నారు. స్థానికంగా పరిష్కారం కాని సమస్యలపై నేరుగా తమను కలిసి అర్జీలు అందజేయవచ్చని కమిషనర్ సూచించారు.

రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలి

నెహ్రూనగర్: బహుజనులు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని ఏపీ రజక జన సేవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. అరండల్‌పేటలోని ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ యూనియన్ హాలులో ఆదివారం రజక చైతన్య వేదిక అధ్యక్షుడు మానేపల్లి దుర్గారావు ఆధ్వర్యంలో 'రజకులకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ బహుజనులకు రాజ్యాధికారంలో భాగస్వామ్య కావాలంటే ఐకమత్యంతో పోరాటం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మానేపల్లి కోట సత్యనారాయణ, విజయలక్ష్మి, ఉదయగిరి, మురళి, గోవింద్, కోటేశ్వరరావు, రమణ, బలరాం పాల్గొన్నారు.

10 వరకు వినికిడి సమస్యలపై ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: వరల్డ్ హియరింగ్ డేను పురస్కరించుకుని మార్చి 10 వరకు వినికిడి సమస్యలున్నవారికి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని స్నేహిల్ స్పీచ్ అండ్ హియరింగ్ రిహాబిలిటేషన్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.శిరీషా ఆదివారం తెలిపారు. స్థానిక కొత్తపేట డాక్టర్స్ ప్లాజా బిల్డింగ్‌లోని తమ సెంటర్‌లో ఉచితంగా వినికిడి పరీక్షలు చేసి, రాయితీతో యంత్రాలు అందిస్తామని పేర్కొన్నారు.

ఇంటి నుంచి తప్పిపోయిన చిన్నారి



దీపిక

పట్నంబజార్: ఐదు సంవత్సరాల చిన్నారి ఇంటి నుంచి తప్పిపోయి పోలీసులకు దొరికిన సంఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం నాజ్ సెంటర్ థియేటర్ వద్ద ఐదు సంవత్సరాల చిన్నారి ఏడుస్తూ తిరుగుతుండగా, పోలీసులు స్టేషన్‌కు తీసుకువచ్చి ఆరా తీశారు. అయితే తన పేరు దీపిక అని, తల్లి పేరు త్రివేణి అని మాత్రమే చెప్పగలుగుతోంది. చిన్నారికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియలేదు. ఈ క్రమంలో ఆమెను శిశుసంక్షేమశాఖాధికారులకు అప్పచెప్పారు. చిన్నారి వివరాలు తెలిసిన వారు కొత్తపేట పీఎస్ ఎస్‌హెచ్‌వో షేక్ అన్వర్ బాషా (86888 31320)కు సమాచారం అందించాలి.

వైఎస్సార్ సీపీ పాలనలో నగరానికి మహర్దశ

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- 18వ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- పాల్గొన్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, మేయర్ కావటి మనోహర్‌నాయుడు, ఎమ్మెల్యే మద్దాళి గిరి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి విడదల రజిని, విప్ లేళ్ల అప్పిరెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ తదితరులు

నెహ్రూనగర్: గుంటూరు నగరాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 18వ డివిజన్ ఎత్తు రోడ్డు వద్ద పలు అభివృద్ధి పనులకు ఆమె ఆదివారం ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ ఎత్తు రోడ్డు నుంచి వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు రూ.69 లక్షలతో, వెస్ట్ ప్యారిష్ చర్చి నుంచి ఎత్తు రోడ్డు జంక్షన్ వరకు రూ.39 లక్షలతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు చేస్తున్నట్లు చెప్పారు. గతంలో ఎన్నడూ లేనంతగా గుంటూరు నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. చిన్న చిన్న సమస్యల్ని కూడా వదలకుండా పూర్తిస్థాయిలో పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో గుంటూరు నగరాన్ని యూజీడీ పేరుతో ధ్వంసం చేశారని దుయ్యబట్టారు. తాము ఒక క్రమపద్ధతిన అభివృద్ధి చేసుకుంటూ వస్తున్నామని పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్లలో గుంటూరును జాతీయస్థాయిలో గొప్ప నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. అభివృద్ధి, ప్రశాంతత... ఈ రెండే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. తెలుగుదేశంపార్టీ నాయకులు రెచ్చగొట్టాలని చూస్తున్నారని, తాము ఎక్కడా సంయమనం కోల్పోబోమని స్పష్టం చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో తాము చేసిన అభివృద్ధి తమ పార్టీ గెలుపునకు దోహదం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. నగరంలో సామాన్య పౌరులకు ఎక్కడా, ఎలాంటి ఇబ్బంది రాకుండా చూస్తున్నామని చెప్పారు. ప్రజల్ని ఇబ్బందులకు గురిచేసిన గత పాలకులకు వారే బుద్ధి చెబుతారని మంత్రి రజిని తెలిపారు.

పేదల పక్షపాతి జగనన్న: ఎమ్మెల్సీ అప్పిరెడ్డి

శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ పేదల పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. ఏకంగా రూ.5లక్షల కోట్లను నిరుపేదలకు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా నేరుగా అందించిన గొప్ప మనసున్న ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమని చెప్పారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఎలాగైనా అధికారం దక్కించుకోవాలనే ఉద్దేశంతో పొత్తులతో కలిసి ప్రజలకు మాయమాటలు చెప్పే ప్రయత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలంతా వాటిని నమ్మే రోజులు పోయాయన్నారు. గుంటూరుతో పాటు రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న సీఎం వైఎస్. జగన్‌కు తిరిగి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని అప్పిరెడ్డి స్పష్టం చేశారు.

మౌలిక వసతుల కల్పనలో రాజీ పడే ప్రసక్తే లేదు : మేయర్ కావటి

మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడు మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించే విషయంలో ఎక్కడా రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా కుల, మతాలు, పార్టీలకు అతీతంగా 57 డివిజన్ల పరిధిలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, ఇతర పనులతో అభివృద్ధి చేసిన ప్రభుత్వం తమదేనని తెలిపారు. ప్రజలకు ఎవరు మంచి చేశారో తెలుసనని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మళ్లీ గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని మేయర్ ధీమా వ్యక్తం చేశారు.

అండగా ఉండే గొప్ప నాయకుడు : ఎమ్మెల్యే మద్దాళి గిరి

పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ ప్రజలకు ఏ కష్టం వచ్చినా తానున్నానంటూ భరోసా కల్పించే ఏకైక గొప్ప నాయకుడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. కరోనా కష్టకాలంలో ఎంతో భరోసాను ఇచ్చి, విలువైన జీవితాలను తమ ప్రభుత్వం కాపాడిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు విడదల గోపి, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నీటిని వృథా చేయొద్దు



నగరంపాలెం: ప్రతి ఒక్కరూ నీటి ఆవశ్యకతను తెలుసుకోవాలని జేకేసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.నాగేశ్వరరావు సూచించారు. కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్- 2 ఆధ్వర్యంలో ఆదివారం అడవితక్కెళ్లపాడు గ్రామ పరిధిలో నీటి ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి వృథా చేయవద్దని గ్రామస్తులకు తెలిపారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్రతి ఇంటికెళ్లి నీటి సంరక్షణ మార్గాలు, ఆవశ్యకత, భూగర్భ జలాలను అభివృద్ధి చేసే మార్గాల్ని వివరించారు. కార్యక్రమంలో ఉప ప్రిన్సిపాల్ పి.గోపీచంద్, పీజీ కోర్స్ డైరెక్టర్ ఎస్ఆర్కే ప్రసాద్, కార్యక్రమ నిర్వహణ అధికారి డి.రాహుల్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

గుంటూరు ఈస్ట్: రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. శ్యామలానగర్‌లో ఓ వ్యక్తి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నాడనే సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం దాడి చేశారు. పేరేచర్ల ప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అతని నుంచి 30క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు చుక్కలతో పోలియోకు అడ్డుకట్ట



పోలియో చుక్కలు వేస్తున్న పానుగంటి చైతన్య, కార్పొరేటర్ ఆచారి



పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ శనక్కాయల రాజకుమారి



పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్



పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ యిర్రి ధనలక్ష్మి



పోలియో చుక్కలు వేస్తున్న వైద్యారోగ్య సిబ్బందితో శ్రీనివాసరావు, అనిల్‌కుమార్

నెహ్రూనగర్: చిన్నారులకు అంగవైకల్యం రాకుండా పోలియో చుక్కలు ఎంతగానో దోహదపడతాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని బ్రాడీపేటలో చిన్నారులకు 32వ డివిజన్ కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ(ఆచారి)తో కలసి పల్స్ పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ పోలియో రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

- చిన్నారుల నిండు జీవితానికి రెండు పల్స్ పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజంగా తీర్చిదిద్దాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు.
- ఆదివారం జీజీహెచ్ ఆవరణంలోని జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు వద్ద ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఆయన చిన్నారులకు పోలియో చుక్కలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రామారావు, నర్సింగ్ సూపరింటెండెంట్ కె. ఆశా సజని పాల్గొన్నారు.
- రెండు చుక్కలతో పోలియో నిర్మూలన చేయవచ్చని అహల్య ట్రస్ట్ నిర్వాహకులురాలు, ప్రముఖ ఐవీఎఫ్ స్పెషలిస్ట్ డాక్టర్ శనక్కాయల రాజకుమారి అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా స్థానిక కొత్తపేట లోని జలగం రామారావు మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించిన కేంద్రంలో ఆమె పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.

తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి

నెహ్రూనగర్: పిల్లల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న పోలియో చుక్కల కార్యక్రమాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని 8వ డివిజన్ కార్పొరేటర్ యిర్రి ధనలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని ఎల్బీనగర్ హెల్త్ సెంటర్‌లో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు కిశోర్, యిర్రి సాయి, ఏఎన్ఎం శైలజ, వలంటీర్ ఇస్సాక్ పాల్గొన్నారు.

పోలియో నిర్మూలన సామాజిక బాధ్యత

గుంటూరు ఎడ్యుకేషన్: పోలియో నిర్మూలన సామాజిక బాధ్యతగా గుర్తించాలని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కార్యనిర్వాహక కమిషనర్ పి. శ్రీనివాసరావు తెలిపారు. కొరిటెపాడులోని ఆర్‌సీఎం యూపీ స్కూల్లో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదేళ్లలోపు వయసు పిల్లలకు వైద్యారోగ్య సిబ్బంది పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సహాయ కార్యదర్శి ఈ. అనిల్‌కుమార్, గుంటూరు, పల్నాడు జిల్లాల కార్యనిర్వాహక కమిషనర్లు శ్రీహరి, టి. శ్రీనివాసరావు, గంటా కిరణ్, విశ్రాంత స్కౌట్ మాస్టర్ కె. మురళీకృష్ణ, గైడ్స్ కెప్టెన్ నాగమణి పాల్గొన్నారు.

నగరంలో 97.90 శాతం పల్స్ పోలియో పూర్తి



పోలియో చుక్కలు వేస్తున్న సీఎంఓహెచ్ డాక్టర్ ఆశా

నెహ్రూనగర్: నగరంలో ఆదివారం పల్స్ పోలియో 97.90 శాతం పూర్తయిందని, సోమ, మంగళవారాల్లో మిగిలిన చిన్నారులకు ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు చుక్కలు వేస్తారని సీఎంఓహెచ్ డాక్టర్ ఆషా తెలియజేశారు. ఆదివారం నగరంలోని పలు ప్రాంతాల్లో జరిగిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఆమెతో పాటు ఎంహెచ్ఓ(ఎఫ్ఏసీ) మధుసూదన్ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆషా నగరంలో 84,776 మంది చిన్నారులకు వ్యాక్సిన్ వేయడం లక్ష్యంకాగా, ఆదివారం సాయంత్రానికి 82,993 మందికి వేసినట్లు తెలిపారు. ఉదయం నుంచి నగరంలో 284 కేంద్రాలు, మొబైల్ వాహనాల ద్వారా బస్టాండ్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో ఏఎన్ఎంలు, ఆశాలు చుక్కలు వేశారని చెప్పారు. సోమ, మంగళవారాల్లో నగరంలో లక్ష్యానికి అనుగుణంగా మిగిలిన 1,783 చిన్నారులకు ఇంటింటికీ వెళ్లి చుక్కలు వేయనున్నట్లు పేర్కొన్నారు.

ప్రైవేటు ఉపాధ్యాయ, అధ్యాపకుల సంక్షేమానికి కృషి

మంత్రి విడదల రజిని



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రజిని

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకుల సంక్షేమానికి కృషి చేస్తానని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని క్యాపిటల్ హోటల్లో ఆదివారం ప్రైవేటు విద్యాసంస్థల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు, అధ్యాపకులతో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి విడదల రజిని మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న గురువులకు ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సముచిత గౌరవాన్ని ఇస్తున్నారని తెలిపారు. ప్రైవేటు రంగంలో చాలీచాలని వేతనాలతో గురువులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా అర్హులకు లబ్ధి చేకూర్చుతోందని చెప్పారు. ప్రతి ఉపాధ్యాయుడు, అధ్యాపకునికి పీఎఫ్, ఈఎస్ఈ, బ్యాంకు ద్వారా వేతనాలు చెల్లించే విధానాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసిందని తెలిపారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకుల్లో ఎక్కువ మంది మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారేనని, వారికి సీఎం వైఎస్. జగన్ అమలు చేస్తున్న నవరత్నాల ద్వారా ఆర్థిక లబ్ధి చేకూర్చుతున్నామని చెప్పారు. వారి శ్రమకు తగిన విధంగా వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించేందుకు ప్రభుత్వ పరంగా కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రైవేటు పాఠశాలల గుర్తింపు, రెన్యూవల్ అంశాలను ఆన్‌లైన్ విధానంలోకి మార్చడం ద్వారా పాఠశాలల యాజమాన్యాలకు ప్రభుత్వం ఉపశమనం కలిగించిన విషయాన్ని మరువరాదని తెలిపారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికీ, సీఎం వైఎస్. జగన్‌కు అండగా నిలవాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న తనకు అండగా నిలిచి, విజయాన్ని చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం వైఎస్. జగన్‌ను మరలా సీఎంగా అధికారంలోకి తీసుకురావడం చారిత్రక అవసరమని చెప్పారు. సమావేశంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘాల నాయకులు కన్న మాస్టారు, పేరిరెడ్డి, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి రామాంజనేయులు, పలువురు పాఠశాలల డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పేదలకు నిలువనీడ జగనన్న ఆశయం

ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి



డీసీ మహేశ్వరరెడ్డితో మాట్లాడుతున్న విప్ అప్పిరెడ్డి

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి పాలనా పగ్గాలు చేపట్టిన నాటి నుంచి పేదలందరికీ కూడు..గూడు..గుడ్డ అనే నినాదాన్ని ఒక విధానంగా మార్చుకుని ముందుకు సాగుతున్నారని శాసనమండలి విప్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. చుట్టుగుంటకు సమీపంలోని దేవాదాయ శాఖకు చెందిన మల్లప్పకుంటలో కొన్ని దశాబ్దాల క్రితమే ఇళ్లు నిర్మించుకుని అనేక కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నాయి. వారిలో కొందరికి 1998 సంవత్సరంలోనే ఇంటి పట్టాలు మంజూరు కాగా, పలువురు నేటి వరకు ఆ అదృష్టానికి నోచుకోలేదు. ఈ క్రమంలో కార్పొరేటర్ అడకా పద్మావతి నేతృత్వంలో ఆదివారం వారంతా బృందావన్ గార్డెన్స్‌లోని కార్యాలయంలో ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డిని కలిసి సమస్యను వివరించారు. వెంటనే స్పందించిన ఆయన అప్పటికప్పుడే దేవదాయ శాఖ డెప్యూటీ కమిషనర్ బొంతు మహేశ్వరరెడ్డిని పిలిపించి సమస్యపై చర్చించారు. న్యాయపరమైన అడ్డంకులు ఎదురవకుండా వీలైనంత త్వరలో శాశ్వత పరిష్కారం చూపి అక్కడి ప్రజలకు వారి పేరుపై ఇళ్లు రిజిస్ట్రేషన్ చేసి ఇప్పించాలని డీసీకి సూచించారు. దీంతో మల్లప్పకుంట వాసుల రెండున్నర దశాబ్దాల నిరీక్షణకు విప్ అప్పిరెడ్డి చొరవతో తెరపడి, వారి చిరకాల స్వప్నం ఫలించడానికి ఎట్టకేలకు మార్గం సుగమమైంది. ఈ సందర్భంగా విప్ అప్పిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఊరి మధ్యలోని పలు ప్రాంతాలలో నివసిస్తున్న అనేక నిరుపేద కుటుంబాలను నిర్దాక్షిణ్యంగా వెలుపలికి తరలించి వారి ఊసే మరిచి, ఉనికినే ప్రశ్నార్థకం చేసిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం అందుకు పూర్తి విరుద్ధంగా ఇళ్ల పట్టాలు ఇచ్చే కార్యక్రమం తీసుకున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే మల్లప్పకుంటలో నివశిస్తున్న వారికి అక్కడే పట్టాలు ఇప్పించే కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. రాష్ట్రంలో ప్రతి పేదవాడికీ సొంతంగా స్థలం, ఇల్లు ఉండాలనే లక్ష్యంతో సీఎం వైఎస్. జగన్ 31లక్షల మందికి నివేశన స్థలాలు మంజూరు చేయడమే కాక అందులో ఇళ్లు కూడా నిర్మించి ఇచ్చే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పేదల బాగు, పేదరిక నిర్మూలన, రాష్ట్ర ప్రగతి, ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న వైఎస్. జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ ఆయన వెన్నంటి నిలవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్, వీరారెడ్డి, చిన్నా, రంగారావు, ప్రసాద్, అంజమ్మ, రాజు, చంద్రయ్య, సాంబయ్య, బుజ్జి, శేషగిరి, రమేష్ పాల్గొన్నారు.

పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తికి పునరంకితం కావాలి

పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ పి. పార్వతి



ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తికి ఉపాధ్యాయులు పునరంకితం కావాలని పాఠశాల విద్యాశాఖ కో–ఆర్డినేషన్ డైరెక్టర్ పి. పార్వతి పేర్కొన్నారు. బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో గుంటూరు మండల పరిధిలోని ఉపాధ్యాయులు పి.నరసింహారావు, బి.బ్రజితరాణి, బి.సుమతి ఉద్యోగ విరమణ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ ఉపాధ్యక్షుడు పి.నాగశివన్నారాయణ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పార్వతి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు అప్‌డేట్ అయ్యి భావి భారత పౌరుల్ని తయారు చేయాలని సూచించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ పూర్వ నాయకులు, ఉపాధ్యాయుల త్యాగం, అంకితభావంతోనే నేటితరం ఉపాధ్యాయులు అనేక సౌకర్యాలు అనుభవిస్తున్నారని తెలిపారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ గతంలో ఉద్యోగ విరమణ పొందితే కుటుంబ పరిస్థితి ఏమిటో అని బాధ పడే పరిస్థితులు ఉండేవని, ప్రస్తుత పరిస్థితుల్లో ఉపాధ్యాయుల ముఖంలో ఆనందం వెల్లి విరుస్తోందన్నారు. కార్యక్రమంలో గుంటూరు ఎంఈవో–2 జ్యోతి కిరణ్, ఉర్దూ డీఐ షేక్ ఖాసిం, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఖాలీద్, జిల్లా కార్యదర్శి ఎస్.ఎస్.ఎన్ మూర్తి, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివరామకృష్ణ, బాలరాజు, జి.దాస్, ఏపీటీఎఫ్ జిల్లా మహిళా కార్యవర్గ కన్వీనర్ భారతి, మల్లీశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొహమ్మద్ తయ్యాబ్‌కు డాక్టరేట్



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ పరిశోధకుడు షేక్ మహమ్మద్ తయ్యాబ్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు రీసెర్చ్ సెల్ కోఆర్డినేటర్ పి. కిరణ్మయి తెలిపారు. ఆయన ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ పరిశోధనా పర్యవేక్షకుడు కె. చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో ' కంట్రోల్ టెక్నిక్స్ ఫర్ పెర్ఫార్మెన్స్ ఇంప్రూవ్‌మెంట్ ఇన్ గాస్ ఇన్సులేటెడ్ స్విచ్‌గేర్స్ బై డైరెక్షన్ అండ్ మిటిగేషన్ ఆఫ్ పార్షియల్ డిస్‌ఛార్జెస్' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినట్లు పేర్కొన్నారు.

ప్రమాదంలో వ్యక్తి మృతిపై కేసు నమోదు

పట్నంబజార్: ప్రమాదంలో వ్యక్తి మృతిపై కేసు నమోదైంది. వెస్ట్ ట్రాఫిక్ పరిధిలోని మిర్చి యార్డులో కూలీగా పనిచేసే మస్తాన్‌వలి(52) ఆదివారం లాలుపురం రోడ్డులోని కృష్ణబాబు కాలనీ మీదుగా వెళ్తున్న సమయంలో లారీ వచ్చి ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మస్తాన్‌వలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కఠోర శ్రమ వృథా కాదు



గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్య సాధన కోసం పడే కఠోర శ్రమ, కృషి ఎన్నడూ వృథా కావని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. భాష్యం సాయి భగవాన్ క్యాంపస్ పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని ఆదివారం కొరిటెపాడులోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ ప్రయత్న లోపం లేకుండా చేసే కృషి ఉత్తమ ఫలితాల్ని ఇస్తుందని తెలిపారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులంతా శ్రమిస్తే భవిష్యత్ జీవితం ఉత్తమంగా ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో భాష్యం ఐఐటీ ప్రోగ్రామర్ ఆనంద్ కుమార్, భాష్యం మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు, ఎంఐటీ ప్రిన్సిపాల్స్ మాలతి, సుధ, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతుల్ని అలరించాయి.

వైభవంగా అద్దంకమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని అద్దంకమ్మ తల్లి ఆలయ ఎనిమిదో వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అద్దంకమ్మ తల్లికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు, మహిళలు అమ్మవారిని దర్శించుకుని హారతులందుకున్నారు. ఆలయ నిర్వాహకులు పెద్ద ఎత్తున ప్రసాద వితరణ చేశారు.